

# అమెరి'కాకమ్మ'కథలు

## వంగూరి చిట్టెన్‌రాజు



# వరాహ జ్వరం కథ

### అమెరికాకమ్మ కథలు- 10

**రెండు** నెలల క్రితం ఒక అమలాపురం అమ్మాయి భయం, భయంగా ఫోన్ లో పిలిచి "సారూ, అమెరికాలో ఉన్న మీరంటే మాకిష్టం, అందు వలన మీ డిష్ నెట్ వర్కులో మా టీవీ నైన్‌ని ఉత్తినే, అనగా పూర్తిగా ఫ్రీగా వచ్చేటట్టు ఏర్పాటు చేస్తాం. అందుకు మీ పెర్మిషన్ కావాలి. లేక పోతే మీ క్వీన్ విక్టోరియా గారితో మాట్లాడతాం"అని వాపోయింది. దాని అర్థం ఏమిటంటే, "నీ పెర్మిషన్ ఎవడిక్కావాలోయ్, అమెరికాలో ఉన్న మన ఆడంగులందరూ ఏదైనా ఫ్రీగా వస్తోందంటే వదిలి పెట్టరూ...ఎందుకంటే ఆవిడ తాలూకు మగాడు నో, నో అని చెప్పడానికి లేదు కదా! మా టీవీ ఏ ఛానల్ లో వస్తోందో చెప్పడానికే ఈ ఫోన్ కాల్" అని నా బ్రిలియంట్ బుర్రకి అర్థం అయిపోయింది.

నాకు అర్థమవందల్లా ఇప్పటికే మా టీవీ లో మా టీవీ వస్తోంది కదా. మరి ఈ మా టీవీ తొమ్మిది అంటే ఏమిటీ అని. బహుశా ఈ టీవీ, తరవాత మా టీవీ, మన టీవీ, మీ టీవీ ఇలాగ రకరకాల పేర్లన్నీ అయిపోయాక వాటికి నెంబర్ సిస్టం పెట్టారు కాబోలు, అందులో ఇది తొమ్మిదోదేమో అనుకుని, మరి మిగిలిన ఎనిమిది టీవీ వాళ్ళూ నన్ను ఎందుకు పిలిచి ఫ్రీ టీవీ ఇవ్వలేదా అని కోపం వచ్చింది. పైగా ఈ ఉచిత టీవీ వ్యవహారం నాకు బాగా తెలుసు. మనం వద్దన్నా ఆగేది కాదు, మా క్వీన్ గారు అందులో ఏదో ఒక ప్రోగ్రాంకి అతుక్కుపోయి, పది రోజుల ఉచిత ప్రసారం తరువాత జన్మంతా చూచుటకు నా ఆస్తి అంతా రాసిచ్చేస్తుంది.

అప్పుడు నేను ఒక గొప్ప స్ట్రేటజీ ఆలోచించి, ఆ అమలాపురం పిల్లతో ముచ్చట్లాడుతూనే, ఆ అమ్మాయి చెప్పిన ఛానెల్ పెట్టగానే సరిగ్గా నేను ఊహించినట్టుగానే టీవీ నైన్ ప్రసారం వచ్చేస్తోంది. అది చూడగానే నా లోకజ్ఞానానికి నేనే వీపు గోక్కుని....అనగా భేష్ అని మెచ్చుకుంటూ వీపు వేపు కొట్టుకున్నాను. అప్పుడర్థం అయింది ఛానల్ పేరు టీవీ నైన్ అని ఎందుకంటారా అని. ఎందుకంటే, బుల్లి తెర మీద మధ్యలో కేవలం నాలుగంగుళాల చదరపు మేరలోనే అసలు టీవీ ప్రోగ్రాం కనపడుతుంది. మిగిలిన 74 అంగుళాలూ రకరకాల బొమ్మలూ, రాతకోతలూ, వస్తూ పోతూ ఉంటాయి. ఇక్కడ మీరు గమనించవలసిన ముఖ్య విషయం ఏమిటంటే, మా ఇంట్లో 78 అంగుళాల పేద్ద టీవీ ఉందనియూ, అది కూడా మామూలు టైపు కాక ప్లాస్మా అనే లేటెస్ట్ రకం అనియూ నేను మళ్ళీ వీపు గోక్కుంటున్నాన మాట. అంత హై క్వాలిటీ టీవీ వలనే అసలు బొమ్మ తక్కువా, కమర్షియల్ బొమ్మలు ఎక్కువగానూ కనపడుతున్నాయేమో అని నాకు అనుమానం వచ్చినా, నేను తీవ్రంగా పరీక్షించగానే, తెర మీద ఒకే సమయంలో తొమ్మిది బొమ్మలో, బ్రహ్మరాతలో కనపడ్డాయి. మళ్ళీ పరి, పరి విధాలుగా పరీక్షించ గానే, మనం ఎప్పుడు చూసినా ఖచ్చితంగా ఒకే స్క్రీన్ మీద తొమ్మిది రక రకాలైన అంశాలు కనపడుతూ ఉంటాయి. అందుకే దానికి టీవీ నైన్ అని వాళ్ళు పేరు పెట్టుకున్నారన మాట.

ఉదాహరణకి, ఆ రోజు టీవీ స్క్రీన్ మధ్యలో..అంటే అసలు న్యూస్ ఐటెం వచ్చే చోటులో ఒక పంది ఒక దేవాలయంలో గుడి చుట్టూనో, విగ్రహం చుట్టూనో తిరుగుతోంది. ఆ వార్త ఏమిటంటే, తణుకు దగ్గర సిద్ధాంతం అనే ఊళ్ళో ఒక వరాహం రోజూ పొద్దున్నే అక్కడి గోదావరి పాయలో స్నానం చేసి, గుళ్ళోకి వచ్చి ప్రదక్షిణలు చేసి, వెళ్ళిపోతుంది. దాంతో స్థానికులే కాక చుట్టుపక్కల అనేక ఊళ్ళనుంచి కూడా చాలా మంది రోజూ అదే నదికి పొద్దున్నే వచ్చేసి, సదరు వరాహంతో బాటు స్నానమాచరించి, ఎందుకైనా మంచిదని ఆ వరాహానికి నాలుగు అడుగుల వెనకాల ఆడవాళ్ళూ, సరిగ్గా అదే కారణానికే కాకుండా పరాయి వారి భార్యలను తడిబట్టలలో చూచు అవకాశాన్ని వదిలిపెట్ట లేక మరొక నాలుగడుగుల వెనకాల వారి తాలూకు భర్తలూ, పెళ్ళి కాని ఆడ పిల్లల వెనక విరహ మంత్రోఛ్ఛారణ...సారీ సారీ...వరాహ మంత్రోఛ్ఛారణ చేస్తూ, వారి బోయ్ ఫ్రెండ్సూ కూడా ప్రదక్షిణలు చేసి తరిస్తున్నారు.

ఈ వార్త నాకు విపరీతమైన ఆసక్తికరంగా ఎందుకుందంటే, ఆ సిద్దాంతం గ్రామం మా వంశం పూర్వీకుల స్థావరం. ఏడెనిమిది తరాల క్రితం మా ఇంటి పేరుగల తాత ముత్తాతలు కొంత మంది  ప.గో జిల్లా నుంచి, తూ.గో జిల్లాకు వలస వెళ్ళారు. నేనొక సారి ఇండియా వెళ్ళినప్పుడు పని కట్టుకుని, సిద్ధాంతం గ్రామానికి వెళ్ళాను. ఒక వీధిలో అక్కడ నివసిస్తున్న అన్ని కుటుంబాలదీ మా ఇంటి పేరే.  ఆ వీధిలోనే 17వ శతాబ్దంలో మా పూర్వీకులు కట్టించిన వినాయకుడి గుడిలో దణ్ణం పెట్టుకుని, అక్కడ పూజారి గారితో భవదీయ వర్తమానం వివరించాను. అన్నీ విని, ఆయన "మీది తూర్పా, పడమరా?" అని అడిగారు. "నాకు అన్ని దిక్కులూ సమానమే సార్" అని చెప్పేసి సరదాగా గుడికి తూర్పు వేపు ఉన్న ఒకరి ఇంటి గోడ మీద మా ఇంటి పేరే చూసి, ఆ ఇంట్లోకి వెళ్ళి నా ప్రవర....అనగా మా ముత్తాత గారి ముత్తాత గారి వివరాలన్నమాట...గొప్పగా చెప్పుకున్నాను. నాదీ, ఆయనదీ ఒకే ఇంటి పేరే అని స్పష్టంగా నేను విన్నవించుకుంటూనే ఉన్నా, నేను ఎన్నారైని అని తెలిసినా, నా తలకాయ వెనకాల కూడా గొప్ప వాళ్ళ లాగా కాంతి పుంజములతో విష్ణు చక్రం తిరుగుతూ ఉండగా చూసినా కూడా ఆ రామయ్య గారు కనీసం మంచి నీళ్ళయినా ఇవ్వకుండా ఠపీమని తలుపు వేశేశాడు. నాకు ఒళ్ళుమండి, ఈ సారి గుడికి పడమటి వేపు వెళ్ళి అక్కడ కూడా మా ఇంటి పేరే వ్రాసి ఉన్న మరొక లక్ష్మణయ్య గారింటికి వెళ్ళి మళ్ళీ అదే డైలాగులు చెప్పాను. ఆయన చాలా సంతోషించి, మంచి నీళ్ళే కాకుండా షర్బత్ కూడా ఇచ్చి ఒక ఎన్నారై అవతారాన్ని కళ్ళారా చూసిన ఫీలింగు దాచుకోకుండా ఆనందించాడు. అసలు విషయం ఏమిటంటే అనేక తరాల క్రితం ఆ గుడికి ఇరువైపులా ఉన్న మా వాళ్ళందరూ ఎందుకో "జంధ్యాలు తెంపుకుని" సంబంధాలు రద్దు చేసుకున్నారుట. అనగా, అవతలి పక్కన ఎవరైనా గుటుక్కుమంటే, ఇవతలి వాళ్ళు మైల పట్టకుండానూ, ఆఖరికి తద్దినం భోజనానికి కూడా వెళ్ళకుండా కట్టుదిట్టం చేసుకున్నారన మాట. ఈ కథంతా రెండు వేపుల నుంచి దక్షిణలు అందుకుంటూ పొట్టపోసుకుంటున్న ఆ బీద  పూజారి గారు చెప్పారు.

ఇప్పుడు టీవీ నైన్‌లో సిద్ధాంతం గ్రామం చూడగానే ఆ వరాహం వెనక ప్రదక్షిణలు చేస్తున్న వివాహితలూ, అవివివాహితలూ, భర్తలూ, బోయ్ ఫ్రెండ్స్ మొదలైన వాళ్ళలో సదరు రామయ్య గారు కానీ, లక్ష్మణయ్య గారు కానీ ఉన్నారేమో అనే కుతూహలం పెరిగిపోయింది. కానీ, ఈ టీవీ నైన్ లో వరాహం గారి  సైజు మరీ చిన్నదైపోయి అర్థంటుగా, ఆరంగుళాల వెడల్పులో స్క్రీన్ తూర్పు వేపు నుంచి పడమటి దాకా... అంటే అడ్డంగా, నిన్ననే విడుదల అయిన ఒకానొక సినిమా ప్రకటన....యాభై రోజుల కేసి దిగ్విజయంగా పరుగులు తీస్తున్న, గుండు సున్నా ప్రొడక్షన్స్ వారి వారి "తన్నునా, చావగొట్టనా - యువర్ ఛాయిస్" అనే సంచలన చిత్రం తాలూకు కమర్షియల్ వచ్చింది. సరిగ్గా దాని కిందనే మరొక ఏడు అంగుళాల "కేవలం వారం రోజులు, రోజుకు తొమ్మిది సార్లు మా సుందర సబ్బు తోముకున్నయడల మీ దేహపు రంగు పవిత్ర సిద్ధాంతం వరాహం రంగు వలె ఎర్రగా రాకపోతే ఛాలెంజ్" అని మరొక ప్రకటనా స్క్రీన్ రివర్స్ దిశలో.. అంటే, పడమటి వేపు నుంచి తూర్పు దాకా, అదే స్పీడులో వచ్చేశాయి. అప్పుడు నా తలకాయ అటూ ఇటూ తిప్పలేక

అవస్థ పడుతూ ఉండగా, ఈ సారి, హఠాత్తుగా ఉత్తర దిశనుంచి దక్షిణం వేపుగా...అనగా టీవీ పైనుంచి కిందకి కూచిపూడి నాట్యాన్ని ప్రశంసించిన పశువర్ధకశాఖా మంత్రిగారు అని ఒకవేపూ, దానికి రివర్స్‌లో ...అంటే కిందనుంచి పైకి అన్న మాట... ఆంధ్రులను తరిమికొడుతున్న ఒబామా పై తంటా సంఘం ఆగ్రహం అని ఎన్నారైల కోసం ప్రత్యేక వార్తా దూసుకొస్తున్నాయి. ఇక్కడ చెప్పుకోదగ్గ టెక్నాలజీ ఏమిటంటే, ఈ ఆరు అంగుళాల నిడివిలోనూ సదరు పశువర్ధక శాఖా మంత్రి గారూ, మరియు తంటా సంఘం అధ్యక్షుల వారూ కూడా సెకనుకి ఒక సారి మన కేసి దూసుకుని వస్తూ, పోతూ ఉంటారు. ఇక అన్ని దిక్కులుగానూ తిరగ లేక, ఎటు తిరగాలో నిశ్చయించుకోలేక, ఈ సారి నువ్వు జుట్టు పీక్కో, లేదా నన్ను గోక్కో అని ఆకాశవాణి పాతాళ భైరవో మరేదో సినిమాలో ఎన్టీవోడికి ఇచ్చినట్టుగా నాకు నా తలకాయ సలహా ఇచ్చింది.

సరిగ్గా ఆ టైములోనే ఇంకా లైన్‌లోనే ఉన్న మా పట్టువదలని విక్రమార్కి, అమలాపురం తాలూకు అమ్మాయి "ఏం సార్, బావుందా మా టీవీ నైన్" అని ఆప్యాయంగా అడిగింది. "మరీ, మీ టీవీ లో తొమ్మిది టీవీలు వస్తున్నాయి కదా. అందులో దేని గురించి అడుగుతున్నావూ?" అని అడిగాను. దాంతో ఆ పిల్ల కొంచెం అదోలా గొంతుక మార్చి, "మీరు చాలా ఫన్నీగా టాక్ చేస్తారు సారూ" అని టెలుగూలో నన్ను థేంక్ చేసింది.

గత వారం, పది రోజులగా ఏ టీవీ చూసినా, ఇండియా అంతటా అకాల మృత్యువులని కలిగిస్తున్న స్వైన్ ఫ్లూ జ్వరం తాలూకు వార్తలూ వింటుంటే ఈ తతంగం అంతా జ్ఞాపకం వచ్చింది.

ఈ వార్తలు వింటూంటే తెలుగు భాష గొప్పతనం కూడా నాకు తెలిసింది. ఎందుకంటే, కొన్ని, కొన్ని మాటలు సరిగ్గా వాడకపోతే వినడానికి జుగుప్సాకరంగా ఉండే అవకాశం ఉంది. వాటికి సరైన మాటలు కూడా మనకి ఉన్నాయి కాబట్టి సరిపోయింది. ఉదాహరణకి "సిద్ధాంతంలో పంది ప్రదక్షిణలు" అంటే ఒళ్ళు మండుతుంది కదా! కానీ "విజయవాడలో పందుల స్వైర విహారం" అంటే కరెక్టుగా ఉంటుంది. అంతే కానీ, వరాహాల విహారం అంటే అతకదు. అలాగే స్వైన్ ఫ్లూకి తెలుగులో "పంది జ్వరం" అన్నారనుకోండి. అందరికీ చికాకు వేస్తుంది కదా! అదే "వరాహ జ్వరం" అంటే పరవా లేదు. ఏమో!

"అదిగో మళ్ళీ పెట్టావా టీవీ నైన్? ఎన్ని సార్లు చెప్పాలి. మొగలి రేకులూ, బ్రహ్మముడీల టైం అయిపోయింది. కావాలంటే మేడ మీద గదిలోకి పోయి చూసుకో ఆ యూస్ లెస్ న్యూస్ అంతా" అంటూ నా చేతిలోంచి రిమోట్ లాక్కుని తన సోఫాలో తన ఫేవరెట్ పొజిషన్ లో విశ్రమించింది మా క్వీన్ విక్టోరియా. అంటే, తరవాత రెండు గంటలూ మనకి విశ్రాంతి అనమాట. థేంక్యూ, టీవీ నైన్. కీప్ ఇట్ ఫ్రీ ఫరెవర్ ప్లీజ్ !

